క్లుప్తంగా

వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

రుద్రవరం: మండలంలోని కొండమాయపల్లె పంచాయతీ మజరా వెలగలపల్లె పొలిమేరలో వెలసిన లక్ష్మీ గోదా సమేత వాసాపురం వేంకటేశ్వర స్వామి వారికి, మానస లింగేశ్వర స్వామికి శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.ఆ లయ నిర్వాహకుల ఆధ్వర్యంలో అర్చకులు గోపీశర్మ,శివ ఉదయాన్నే స్వామి అమ్మవార్లకు నిత్య పూజలు గావించారు. అనంతరం స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

బాలకార్మికులను గుర్తించండి

నంద్యాల(సిటీ): పట్టణ పరిసర ప్రాంతాల్లో 5 - 18 సంవత్సరాల వయస్సు గల బాల బాలికలు బడిలో ఉండేలా చేసి, బాలకార్మిక నిరోధక చట్టాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు శనివారం ఓ ప్రకటనలో కోరారు. పట్టణంలోని బైక్, కార్ వాటర్ సర్వీసింగ్ సెంటర్లు, పంక్చర్ షాపులు, కూరగాయల దుకాణాలు, హోటళ్లు, ఎరువుల దుకాణాలు, వీధి వ్యాపారాలు, భవన నిర్మాణ, చెత్త సేకరణ, చెక్క సామన్లు, బంగారు అంగళ్ల తదితర దుకాణాల్లో పనిచేస్తున్న బాలలను సచివాలయ శానిటేషన్, టౌన్‌ప్లానింగ్ సెక్రటరీలు గుర్తించాలని సూచించారు. ఆయా దుకాణాల్లో బాల కార్మికులు ఉంటే సంబంధిత యజమానులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

పకడ్బందీగా ఈ- క్రాప్ నమోదు

ఉయ్యాలవాడ : రబీలో సాగు చేసిన పప్పుశనగ, మినుము, సోయాబీన్, పొగాకు, వేరుశనగ తదితర పంటలను ఈ- క్రాప్ నమోదును పకడ్బందీగా చేస్తున్నామని వ్యవసాయాధికారి రాజేంద్రకుమార్ తెలిపారు. శనివారం ఏఓ మాట్లాడుతూ ఈ-క్రాప్ నమోదుకు సంబంధించిన యాప్‌ను ప్రభుత్వం అందుబాటులో ఉంచిందన్నారు. ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో రైతులు తాము సాగు చేసిన పంటల వివరాలను వెల్లడించాలన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు క్షేత్రస్థాయికి వెళ్లి పంటలను పరిశీలించి ఈ క్రాప్‌తో పాటు ఈకేవైసీ చేస్తారని చెప్పారు.

వ్యాధులతో జాగ్రత్త

గోస్పాడు: చలికాలంలో వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి గోపాల్ తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చలి బారి నుంచి చిన్నపిల్లలు, వృద్ధులు తగిన జాగ్రత్తలు పాటించేలా సూచించాలని చెప్పారు. చిన్న పిల్లలకు దగ్గు, జబులు వంటివి ప్రబలే అవకాశం ఉందన్నారు. దోమలు అధికంగా ఉండే అవకాశం ఉందని, వాటి ద్వారా విషజ్వరాలు ప్రబలే అవకాశమున్నందున జాగ్రత్తలు పాటించాలన్నారు.

నేటి నుంచి త్రోబాల్, ఫెన్సింగ్ పోటీలు

నంద్యాల(న్యూటౌన్): ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ 67వ అండర్-14, 17 త్రోబాల్, ఫెన్సింగ్ క్రీడలు ఖాదరబాద్ నర్సింగరావు పురపాలక ఉన్నత పాఠశాలలో ఈనెల 10 నుంచి 14వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు స్కూల్ గేమ్ ఫెడరేషన్ జిల్లా సెక్రటరీ శివకుమార్ శనివారం తెలిపారు. విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ ఖాదరబాద్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో ముందుండాలన్నారు.

'ఉపాధి' పనులు ప్రారంభించాలి

నంద్యాల(న్యూటౌన్): ఉపాధి హామీ పనులను వెంటనే ప్రారంభించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సుబ్బరాయుడు కోరారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వలసలు, కరువు నివారణకు ఉపాధి హామీ పనులు తక్షణమే ప్రారంభించాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. గ్రామీణ కష్టజీవుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 14వ తేదీన విజయవాడలో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. సంఘం నాయకులు పాల్గొన్నారు.

వార్డు సచివాలయాల పరిశీలన

నంద్యాల (సిటీ): పట్టణంలోని పలు వార్డు సచివాలయాలను మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ముందుగా 8, 9, 10, 12 వార్డులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ పౌర సేవల్లో సిబ్బంది నిర్లక్ష్యం వహించకుండా సేవలందించాలన్నారు. లబ్ధిదారులను గుర్తించేందుకు 6స్టెప్ వెరిఫికేషన్ తప్పని సరిగా చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర, ఆరోగ్యశ్రీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. వార్డు పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, రోజువారీగా అందాల్సిన సౌకర్యాలపై దృష్టి సారించాలని ఆదేశించారు.

టీడీపీ దుష్ప్రచారాలను నమ్మొద్దు



వృద్ధురాలికి పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(సిటీ): వైఎస్సార్‌సీపీ పాలనలో సంక్షేమ పాలన సాగిస్తున్నా టీడీపీ నాయకులు చేస్తున్న దుష్ప్రచారాలను ప్రజలు నమ్మొద్దని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి కోరారు. పట్టణంలోని 21వ వార్డు నూనెపల్లెలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వార్డు ఇన్‌చార్జ్ అనిల్ అమృతరాజ్, రాష్ట్ర దృశ్యకళల డైరెక్టర్ సునీత అమృతరాజ్ ఆధ్వర్యంలో ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధితో పాటు, పేదలకు జరుగుతున్న మంచిని వివరించారు. ముందుగా ఆయా కాలనీల్లో స్థానికులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత నాలుగున్నర సంవత్సరాల్లో గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా సమస్యలను సత్వరమే పరిష్కరించడమే కాకుండా, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఎన్నో ఏళ్లుగా పేరుకుపోయిన సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతున్నామని చెప్పారు. సంక్షేమ ప్రభుత్వానికి ప్రజల మద్దతు ఇవ్వాలని ప్రతి ఒక్కరికీ మంచి చేస్తున్న ప్రభుత్వాన్ని 2024 ఎన్నికల్లో గెలిపించాలని పిలుపునిచ్చారు. వ్యవస్థలో సమూల మార్పులు తెచ్చి విద్య వైద్య రంగాలలో వినూత్న సంస్కరణలు చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. ఎన్నికలు సమీపిస్తున్నందున టీడీపీ నాయకులు ప్రజల వద్దకు వచ్చి మాయ మాటలు చెబుతున్నారని మండిపడ్డారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, వైస్ చైర్మన్ పాంశావలి, పున్నశేషయ్య, జాకీర్ హుసేన్, ఆప్కో డైరెక్టర్ సుబ్బరాయుడు, కౌన్సిలర్లు కృష్ణమోహన్, సాదిక్‌బాషా, నాయకులు రహంతుల్లా, పార్థుడు, కిరణ్‌కుమార్, లక్ష్మీనారాయణ, మాబాషా, అంజి, బత్తుల శేషగిరి, శేషక్క, భాస్కర్ పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో శ్రీలక్ష్మీనరసింహ కంబగిరిస్వామి, ఆర్.జంబులదిన్నెలో పూజలు చేస్తున్న భక్తులు

ఆలయాల్లో కార్తీక పూజలు

ఉయ్యాలవాడ : కార్తీక మాసం పురస్కరించుకుని మండలంలోని సుద్దమల్ల, ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, ఇంజేడు గ్రామాల్లో వెలసిన ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ లక్ష్మీనరసింహ కంబగిరిస్వామి, శ్రీ అభయాంజనేయస్వామి, శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వాముల వారికి ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చన, ఆకుపూజ చేపట్టి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు కమలేష్‌శర్మ, లక్ష్మణస్వామి, భాస్కరశర్మ, అనంతయ్య భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఘనంగా వైఎస్ భారతి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(సిటీ):పట్టణంలోని 21వ వార్డు నూనెపల్లెలో శనివారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సతీమణి వైఎస్ భారతిరెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, రాష్ట్ర డైరెక్టర్లు శశికళారెడ్డి, సునీతా అమృతరాజ్, వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాళ్లు, కార్యకర్తల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మహిళలకు అధిక ప్రాధాన్యతనిచ్చిందని చెప్పారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న శాంభవి

నంద్యాల(వ్యవసాయం): స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న బ్రాహ్మణ అపరకర్మల భవన సముదాయంలోని శివాలయంలో ఆధ్యాత్మిక వేత్త యోగిని శాంభవి బాణ లింగేశ్వరస్వామికి శనివారం పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు దుర్గాప్రసాద్, నగరడోన సుధీర్ స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమాఖ్య అధ్యక్షుడు మురళీకృష్ణ, విశ్వనాథ్ పాల్గొన్నారు.

ఘనంగా చర్చి జన్మోత్సవ ప్రతిష్ట



దేవుడి సందేశాన్ని వినిపిస్తున్న మత పెద్ద

చాగలమర్రి: మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో వెలసిన పురాతన చర్చి 131వ పరిశుద్ధ జన్మోత్సవ ప్రతిష్ట వేడుకలను శనివారం డీనరి చైర్మన్ రెవ.వరప్రసాద్ అధ్యక్షతన స్థానిక చర్చి ఫాదర్ రెవ.సంజీవరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. 1893 డిసెంబర్ 9న అప్పటి మిషనరీ అయిన ఫ్రెడ్రిక్‌జెల్‌చే ప్రతిష్టించబడి రెవ.డిండి షేఫర్డ్‌చే నిర్మాణం పూర్తి గావించబడి నేటికి 131 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం విశేషంగా చెప్పుకోవచ్చన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆళ్లగడ్డ డీనరీ చైర్మన్ రెవ.సునీల్ కుమార్ పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

శిరివెళ్ల: కోటపాడు ఏస్సీ కాలనీలో శనివారం గోస్పాడు మండలం యాళ్లూరుకు చెందిన కొటికే బాలమద్దిలేటి (50) మృత దేహం పోలీసులకు లభ్యమయింది. మృతిపై కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేయడంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. కాలనీలోని ఓ వరి గడ్డి వామి వద్ద గడ్డిలో కప్పిన మృతదేహం వెలుగు చూసింది. గ్రామస్తుల సమాచారం మేరకు ఎస్‌ఐ సురేష్ సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేశారు. కాగా ఈ ఘటనలో కాలనీకి చెందిన ఓ మహిళను పోలీస్‌లు అదుపులోకి విచారణ చేస్తున్నారు. మృతుడి కుమారుడు మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహంపై ఎలాంటి గాయాలు లేవని అయితే మృతిపై కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేశారని ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించామని, అందులో వాస్తవాలు వెల్లడవుతాయని చెప్పారు.

జిల్లా స్థాయి చెస్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న రవికృష్ణ

నంద్యాల(న్యూటౌన్): ఆంధ్రప్రదేశ్ చెస్ సంఘం ఆధ్వర్యంలో శనివారం నంద్యాల జిల్లా సంఘం పర్యవేక్షణలో పట్టణంలోని హనీఫ్‌నగర్‌లోనున్న రోటరీ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో జిల్లా స్థాయి చెస్ పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ అధ్యక్షతన జరిగాయి. ప్రిన్సిపాల్ సుబ్బయ్య, రాష్ట్ర చెస్ సంఘం జాయింట్ సెక్రటరీ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ చెస్ పోటీల వల్ల విద్యార్థుల్లో ఏకాగ్రత పెరుగుతుందన్నారు. జిల్లాస్థాయిలో ప్రతిభ చూపిన క్రీడాకారులు విజయవాడ, తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. పోటీల్లో 150 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు.

ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్

- యర్రగుంట్లకు రూ.2.81 కోట్లు మంజూరు



యర్రగుంట్లలో ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల

శిరివెళ్ల: ప్రజలకు తాగునీరు అందించేందుకు ఇంటింటికీ కుళాయి ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి తెలిపారు. శనివారం యర్రగుంట్ల మేజర్ గ్రామ పంచాయతీలోని కోటబురుజు, మెయిన్ బజార్, కుమ్మరి వీధి, మార్కెండేయనగర్, హైస్కూల్ ప్రాంతం, ఎస్సీ కాలనీల్లోలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి నాలుగున్నర ఏళ్లలో అందిన ప్రభుత్వ పథకాల లబ్ధిని చదివి వినిపించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ జల జీవన్ మిషన్ కింద డ్వాక్రా సంఘాల ఆధ్వర్యంలో ఇంటింటికీ కుళాయి ఏర్పాటుకు చర్యలు మొదలయ్యాయన్నారు. అందులో భాగంగా శిరివెళ్ల మండలంలోని 24 గ్రామాలకు రూ.16.55 కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. యర్రగుంట్లకు రూ.2.81 కోట్లు మంజూరయ్యాన్నారు. గ్రామంలో తాగునీరు సక్రమంగా అందించేందుకు మరో 3 అదనపు వాటర్ ట్యాంక్‌లు నిర్మించనునానారని పేర్కొన్నారు. అలాగే రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గ్రామంలోని 1,445 మంది రైతులకు నాలుగేళ్లలో రూ.7.53 కోట్లు, 867 మంది రైతన్నలకు రూ.1.72 కోట్లు వారి ఖాతాల్లో జమయ్యాయన్నారు. ఆరోగ్యశ్రీ కింద 512 మందికి రూ. 2.32 కోట్లు, 673 మంది విద్యార్థులకు విద్యా దీవెన కింద రూ.1.73 కోట్లు, 454 మందికి చేయూత కింద 2.09 కోట్లు జమయయ్యారన్నారు. అనంతరం జగనన్న కాలనీలలో పూర్తయిన ఇళ్లను ప్రారంభించారు. ప్రభుత్వ వైద్యశాలలో గర్భిణులులు, బాలింతలకు వివేకానందస్వామి ట్రస్ట్ ఏర్పాటుకు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్ బేగం, ఎంపీపీ నాయక్ వసీం, సర్పంచు అయ్యలూరి సుభహాన్, ఏంపీటీసీ ,నబీరూన్‌బీ, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బీ.అబ్దుల్ సలాం , మండల అధ్యక్షుడు ఇందూరి ప్రతాపరెడ్డి, నాయకులు సత్తార్ ప్రతాపరెడ్డి, గాజ కృష్ణారెడ్డి, మేర్వ చిన్ననాగిరెడ్డి, సత్తార్ ప్రభాకరరెడ్డి, పూల రామిరెడ్డి, శంకర్, యాపరాల నడిపి గుర్రప్ప, పురుషోత్తం, పెద్దలాల్ వీరారెడ్డిపల్లె సర్పంచు మందాల శివారెడ్డి, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఐటా నూతన కార్యవర్గం ఎన్నిక

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలో శనివారం ఇండియా ఐడియల్ టీచర్స్ అసోసియేషన్ నంద్యాల జిల్లా అడహక్ కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. ఐటా స్టేట్ ప్రెసిడెంట్ అబ్దుల్‌రజాక్, సెక్రటరీ షాకీర్‌హుసేన్ ఆధ్వర్యంలో జమాతే ఇస్లామీ హింద్ అధ్యక్షుడు అబ్దుల్ సమ్మద్, నంద్యాల జిల్లా ఐటా కార్యవర్గాన్ని నిర్వహించారు. అధ్యక్షుడిగా హఫీజ్, సోయాబూజ్ జమాన్, ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్ సలీమ్, ట్రెజరర్‌గా జమీల్, గౌరవ సలహాదారుగా మోమిన్ సైఫుల్లాను ఎన్నుకున్నట్లు తెలిపారు.

దీక్షను జయప్రదం చేయండి



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 14, 15 తేదీల్లో నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న 36 గంటల దీక్షను జయప్రదం చేయాలని జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు ఏసురత్నం, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు రమణకుమారి కోరారు. శనివారం స్థానిక కార్యాలయంలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కనీస వేతనం, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, పని భారం తగ్గించాలని, గ్రూపు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బాల వెంకట్, షమీమ్, శిరోమణి, వసంత పాల్గొన్నారు.

మారెమ్మ ఆలయంలో చోరీ

దొర్నిపాడు: మండలంలోని గుండుపాపల గ్రామంలో శుక్రవారం రాత్రి మారెమ్మ ఆలయంలో చోరీ జరిగిందని ఎస్‌ఐ తిరుపాల్ శనివారం తెలిపారు. గ్రామ శివారులోని ఆలయంలోని రూ.50వేల విలువజేసే వెండి కిరీటం, హుండీలోని రూ.5వేల వరకు నగదును గుర్తుతెలియని దొంగలు దోచుకెళ్లినట్లు చెప్పారు. పూజారి వెంకటరమణ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గ్రామాల్లో 'వికసిత్ భారత్'

నంద్యాల(అర్బన్): మండలంలోని మేజర్ పంచాయతీ కానాల, గుంతనాల గ్రామాల్లో శనివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్‌లు బావమ్మ, నాగమ్మ అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ సుగుణశ్రీ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో భాగంగా పలువురు గర్భిణులకు సీమంతాలు జరిపించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు జగదీశ్వరరెడ్డి, ఏఓ ప్రసాదరెడ్డి, నాగేశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆరోగ్యమ్మ పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా..



గోస్పాడులో నిర్మాణం పూర్తయిన గ్రామ సచివాలయం

గోస్పాడు: మండల కేంద్రానికి మంజూరైన గ్రామ సచివాలయ భవనం నిర్మాణం పూర్తయ్యింది. ప్రస్తుతం తుది మెరుగులు దిద్దుతున్నారు. భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.35లక్షలు మంజూరు చేయడంతో పూర్తిస్థాయి సౌకర్యాలతో నిర్మాణం పూర్తి చేశారు. త్వరలో ప్రారంభం కానుందని సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

శ్రీశైలంలో అంతర్గత బదిలీలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో పలువురు అధికారులు, ఉద్యోగులను అంతర్గత బదిలీ చేస్తూ దేవస్థానం కార్యనిర్వాహణాధికారి డి.పెద్దిరాజు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలన సౌలభ్యం కోసం పలువురు ఉద్యోగులను అంతర్గత బదిలీలు చేసినట్లు ఈఓ తెలిపారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్‌కు యథావిధిగా ఉన్న విధులను కేటాయిస్తూ దేవస్థానం వైద్యశాల పర్యవేక్షణ నుంచి తప్పించారు. అలాగే నూతనంగా సహాయ కార్యనిర్వాహణాధికారిగా పదోన్నది పొందిన మల్లికార్జున రెడ్డికి శానిటేషన్ విభాగాన్ని కేటాయిస్తూ వసతి విభాగం, క్యూకాంప్లెక్స్ పర్యవేక్షణ, ప్రొటోకాల్ విధులను కేటాయించారు. ఆలయ ఏఈఓగా ఉన్న మోహన్‌కు యథావిధిగా విధులు నిర్వహించాలని సూచించారు. ఏఈఓ ఎం. ఫణీధరప్రసాద్‌కు రెవెన్యూ, లీగల్, డొనేషన్ కౌంటర్, అన్నప్రసాద విభాగ పర్యవేక్షణ అప్పగించారు. పర్యవేక్షకులు అయ్యన్నకు వసతి విభాగం, టోల్‌గేట్, దేవస్థాన వైద్యశాల, గ్యాస్ గోడౌన్ కేటాయించారు. అలాగే రవి కుమార్‌కు ప్రస్తుతం ఉన్న విధులతో పాటు అదనంగా ప్రొటోకాల్ విధులు కేటాయించారు. వీరితోపాటు సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్ పలువురు రెగ్యులర్ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్‌ఉద్యోగులను మొత్తం 32 మంది ఉద్యోగులను ఈఓ అంతర్గత బదిలీ చేశారు. బదిలీ అయిన ఉద్యోగులు తక్షణమే వారికి కేటాయించిన విధుల్లో చేరాలని ఆ ఉత్తర్వుల్లో ఈఓ పేర్కొన్నారు.

ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న లీగల్‌సెల్ అధ్యక్షుడు రామసుబ్బయ్య

నంద్యాల(వ్యవసాయం): ఈ నెల 10వ తేదీన నిర్వహించే నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాల ని నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు రామసుబ్బయ్య, పట్టణ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి కోరారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం స్థానిక హోటల్ సూరజ్ గ్రాండ్ సమావేశ భవనంలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి, ఏపీ వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కోఆర్డినేటర్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్‌బాషా, ఎమ్మెల్యేలు శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, గంగుల బిజేంద్రారెడ్డి, శిల్పా చక్రపాణిరెడ్డి, తొగురు ఆర్థర్ హాజరవుతారన్నారు. కార్యక్రమానికి పట్టణ, జిల్లా న్యాయవాదులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. లీగల్‌సెల్ నాయకులు ముక్కెర కృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, అశోక్‌కుమార్‌రెడ్డి, తిమ్మారెడ్డి, బాలవెంకటరెడ్డి, రామకృష్ణారెడ్డి, అంబేడ్కర్, వంశీ, వెంకట్ పాల్గొన్నారు.

క్రిష్టిపాడు వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో పావనికి వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్



ఆనందం అంటే ఇదే..

ఈ ఫొటోలో డాక్టర్‌కు కుడివైపున సంతోషంగా నిలబడి ఉన్న వ్యక్తి పేరు దూదేకుల మస్తాన్. తన కూతురు పావని గర్భిణి కావడంతో క్రిష్టిపాడు గ్రామంలోని వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌కు శనివారం తీసుకొచ్చారు. అక్కడ డాక్టర్ నాగేంద్ర వైద్యపరీక్షలు చేశారు. గతంలో వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లేవారమని, ప్రస్తుతం మా గ్రామంలోనే ఆధునిక వైద్యం అందుతుండటంపై హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం తన కుమార్తెకు నెలలు నిండాయని, వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి వస్తే వైద్యులు పరీక్షలు చేసి పలు జాగ్రత్తలను సూచించి, మందులు ఉచితంగా అందజేశారని చెప్పారు. ఆశావర్కర్ నుంచి ఏఎన్ఎం, సూపర్‌వైజర్, డాక్టర్ ఇలా ప్రతి ఒక్కరూ రోగులను ఆప్యాయంగా పలకరించి వైద్యం అందిస్తుండటం ఇంతకుముందు చూడలేదన్నారు. పూర్తి వసతలు ఉండటంతో తమకు ఇబ్బందులు కలగలేదని పేర్కొన్నారు.

\- దొర్నిపాడు

వైభవంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం



చెరువు కట్ట నుంచి కలశాలను తీసుకొస్తున్న అయ్యప్ప మాలధారులు, ప్రత్యేక అలంకరణలో అయ్యప్పస్వామి



జ్యోతులతో ముందుకు సాగుతున్న మహిళలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గుడిపాటిగడ్డలో వెలసిన అయ్యప్పస్వామి దేవస్థానంలో 44వ మండలి విళక్కి పూజా మహోత్సవాలు గ్రామోత్సవంతో శనివారం ముగిశాయి. ఉదయాన్నే కన్య స్వాములతో సింగారి మేళ వాయిద్యాలతో ఆలయం నుంచి పురవీధుల గుండా స్థానిక చెరువు కట్ట నుంచి కలశాల్లో జలాన్ని తీసుకొచ్చారు. అనంతరం అయ్యప్పస్వామి ఉత్సవమూర్తికి విశేష తిరుమంజనం, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించి పూలంగి సేవ జరిపించారు. అనంతరం మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేసి అన్నదానం చేశారు. సాయంత్రం పాలకొమ్ముతో అయ్యప్ప మాలధారులతో కలిసి ఉత్సవమూర్తిని పురవీధుల్లోడా కేరళ సింగారి మేళం, పేటతుల్లితో ఊరేగించారు. మహిళలు దీపాలతో ముందు నడవగా గ్రామోత్సవం కనులపండువగా సాగింది. ఆలయం నుంచి గాంధీచౌక్, కల్పనా సెంటర్, బైర్మల్‌వీధి, ఆర్టీసీ బస్టాండ్, మెయిన్ బజార్ నుంచి ఆలయానికి చేరుకుంది. అనంతరం పడిపూజ నిర్వహించి ఊంజల సేవ, మంగళ హారతులు, హరివరాసనంతో వేడుకలను ముగించారు. కార్యక్రమంలో కల్లూరి రామలింగారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, విజయ్‌కుమార్, గోపాలకృష్ణమూర్తి, కండే శ్యాంసుందర్, సత్యనారాయణ పాల్గొన్నారు.